




# ఎన్నాళ్లీ యాతన..!

- కర్నూలు జీజీహెచ్‌లో సమస్యలు
- నిధులు లేక ఆగిపోయిన ఐపీడీ బ్లాక్
- రోగులకు తప్పని తిప్పలు
- పూర్తి స్థాయిలో లభించని సేవలు
- నేడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రాక
- స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ పరికరాల ప్రారంభం




కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ వాసులకు ఆరోగ్య సంజీవనిగా పేరొందిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సమస్యలు వెంటాడుతున్నాయి. వైద్యసేవలు అంతంత మాత్రంగా ఉన్నాయి. గత వైసీపీ హయాంలో కొత్త భవనాల పేరుతో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆపరేషన్ థియేటర్లకు సంబంధించిన పాత భవనాలను పడగొట్టి కొత్తగా ఐపీడీ బ్లాక్ నిర్మాణ పనులు చేపట్టింది. కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద రూ.500 కోట్లతో భవనాల నిర్మాణ పనులను ప్రారంభించింది. భవనాలకు రూ.350కోట్లు, పరికరాలకు రూ.150కోట్లు కేటాయించారు. ఆసుపత్రిలో ఐపీడీ బ్లాక్, కర్నూలు మెడికల్ కాలేజీలో లెక్చరర్ గ్యాలరీ పనులను హైదరాబాదుకు చెందిన కేఎంవీ ప్రాజెక్టు లిమిటెడ్ ప్రారంభించారు. కాంట్రాక్టరుకు రూ.17.89 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. మరోవైపు కొత్త పనులకు అనుమతులు లేకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. శనివారం జిల్లా పర్యటనలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ కర్నూలు సర్వజన ఆసుపత్రిలో పర్యటిస్తారు. మంత్రి నేరుగా ఆసుపత్రిని సందర్శించి సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### మెడికల్, సర్జరీ రోగుల అవస్థలు



కొత్త భవనాల పేరుతో పాత భవనాలను కూల్చివేయడంతో ఆ స్థానంలో ఉన్న మెడికల్, సర్జరీ రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. అత్యంత రద్దీ ఉన్న ఎంఎం-1, ఎంఎం-2, ఎంఎం-5, ఎంఎం-6, ఎంఎం-7, సర్జరీ యూనిట్ల వార్డులను పాత చిన్న పిల్లల విభాగం, ట్రామాకేర్, ఓల్డ్ గైనిక్ వార్డులోకి రోగులకు తరలించారు. ట్రామాకేర్‌లో భవనాలు చాలక వరండాలోనే రోగులను ఉంచుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఐపీడీ బ్లాకు నిర్మాణాలు పూర్తయితే 600 పడకలు అందుబాటులోకి వస్తాయి. కానీ నిర్మాణాలు మాత్రం నత్తనడకన సాగుతూ ఎప్పుడు పూర్తవుతాయోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ట్రామాకేర్ నిరూపయోగం

ప్రమాదాల్లో గాయపడిన వారికి మెరుగైన సేవలు అందించేందుకు కర్నూలు జీజీహెచ్‌లో ట్రామాకేర్ యూనిట్‌ను ఏర్పాటుచేశారు. జాతీయ రహదారులు ఉన్న ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేస్తుంది. అయితే ఇటీవల కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ట్రామాకేర్ యూనిట్ నిరూపయోగంగా మారింది. ఆసుపత్రికి అనంతపురం, సత్యసాయి జిల్లా కడప, ప్రకాశం, కర్నూలు జిల్లాలతో పాటు తెలంగాణలోని గద్వాల జిల్లాల నుంచి ప్రజలు చికిత్స కోసం ఇక్కడికి వస్తుంటారు. కొద్దిరోజులుగా ట్రామాకేర్ పేరు మరుగున పడిపోయింది. ఈ ట్రామాకేర్ భవనంలో ఎంఆర్ఐ యంత్రంతో పాటు మెడికల్, న్యూరోసర్జరీ యూనిట్లను పెట్టి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అలాగే ట్రామాకేర్ కింద నియమితులైన సిబ్బంది, వైద్యులను ఇతర విభాగాలకు తరలించి సేవలందిస్తున్నారు.



ట్రామకేర్ వార్డు

### అసౌకర్యాల నడుమ 'సూపర్ స్పెషాలిటీ కాంప్లెక్స్'

రాయలసీమ వాసులకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలన్న ఉద్దేశంతో 1993 సెప్టెంబరు 26న అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. 33 ఏళ్లు దాటినప్పటికీ సూపర్ స్పెషాలిటీ బిల్డింగ్ కాంప్లెక్స్‌లో యురాలజీ, నెఫ్రాలజీ, కార్డియోథోరాసిక్, ఐసీయూ వార్డు, కార్డియాలజీ, క్యాథ్‌ల్యాబ్, నెఫ్రోప్లస్ డయాలసిస్ సెంటర్, న్యూరోసర్జరీ వార్డు, యూరాలజీ న్యూరోసర్జరీ ఆపరేషన్ థియేటర్లు సేవలు అందిస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ సేవలకు సంబంధించిన ఎండోక్రైనాలజీ, న్యూరాలజీ విభాగాలకు భవనాలు లేకపోవడంతో ఎంసీహెచ్ బ్లాక్‌లో సేవలు అందిస్తున్నారు. ఇటీవల కాలం సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో సేవలు పెరిగాయి. రోగులు పెరిగారు. దాదాపు 8 స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయి. పీజీల సంఖ్య పెరిగింది. పెరిగిన రోగులకు అనుగుణంగా కొన్ని వార్డులో నిర్వహణ సరిగ్గా లేక పెచ్చులూడిపోతున్నాయి. దీంతో యూరాలజీ న్యూరోసర్జరీ విభాగాలకు సంబంధించిన ఆపరేషన్ థియేటర్లను మూడో అంతస్తు నుంచి ఖాళీ చేయించారు. పొరుగు జిల్లా అనంతపురం నగరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు పీఎంఎస్‌వీ కింద ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను రూ.150 కోట్లతో అత్యాధునిక హంగులతో నిర్మించారు. అదే తరహాలో కర్నూలు జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంజూరు చేయాలని వైద్యఆరోగ్య శాఖ మంత్రిని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



సూపర్ స్పెషాలిటీ బ్లాక్

### కార్పొరేట్‌కు దీటుగా సేవలు



స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో కార్పొరేట్‌కు దీటుగా మెరుగైన సేవలు అందనున్నాయి. ఇప్పటికే హాస్పిటల్‌కు రూ.28 కోట్లు లీనియర్ యాక్సిలేటర్, సిటీ సెమిలేటర్, హాస్పిటల్‌కు చేరాయి. ఆసుపత్రిలో 120 పడకలు ఉండగా.. 87 మంది రోగులు చికిత్స పొందుతున్నారు.

- డా. సీఎస్ కృష్ణప్రకాష్, డైరెక్టర్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కర్నూలు

### నేడు పరికరాల ప్రారంభం



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పరికరాలను ప్రారంభించడానికి వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం ఉదయం వస్తారు. కర్నూలు జీజీహెచ్‌లోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని కార్డియాలజీ, కార్డియోథోరాసిక్ విభాగాలను మంత్రి పరిశీలిస్తారు. అనంతరం కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో మంత్రి వైద్యులతో సమీక్ష నిర్వహిస్తారు.

- డా. కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

### కర్నూలులో ప్రపంచ స్థాయి క్యాన్సర్ సేవలు



కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రపంచ స్థాయి క్యాన్సర్ వైద్యసేవలు అందుబాటులో రానున్నాయి. కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణంలో 9.30 ఎకరాల్లో స్థలంలో రూ.120 కోట్ల వ్యయంతో 120 పడకల స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను 2019 జనవరి 8న ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఆసుపత్రి భవనం పూర్తి కాగా, ఇటీవలే రూ.28 కోట్ల విలువైన లీనియర్ యాక్సిలేటర్ యంత్రం, రూ.9.88 కోట్లతో సిటీ సెమిలేటర్ ఆపరేషన్ థియేటర్, అనస్థీషియా వర్క్‌స్టేషన్ అందుబాటులో వచ్చాయి. రూ.5 కోట్ల హెచ్‌డీఆర్ బ్రాంకో థెరపి, 19 కోట్ల పెట్‌స్కాన్, రూ.1.50 కోట్ల విలువైన మయోగ్రామ్ పరికరాలు రావాల్సి ఉంది. రాయలసీమ ప్రాంత ప్రజలకు అత్యుత్తమ స్థాయిలో క్యాన్సర్ సేవలు అందించేలా స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఆసుపత్రిలో డైరెక్టర్‌తో పాటు 25 మంది వైద్యులు, 26 మంది నర్సింగ్ సిబ్బంది, 10 మంది రేడియేషన్ థెరపి టెక్నీషియన్, డైటీషియన్ అందుబాటులో ఉన్నారు. శనివారం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక హైయర్ మిషన్ అన్ని రకాల రేడియేషన్ క్యాన్సర్‌కు చికిత్స అందించే లీనియర్ యాక్సిలేటర్ యంత్రం ఫోటో ఎగ్జిబిషన్, మెడికల్ అంకాలజి వార్డును ప్రారంభించనున్నారు.


## మహారాష్ట్ర ఉల్లి దిగుమతులు

- గడ్డు పరిస్థితుల్లో జిల్లా రైతులు
- క్వింటా ఉల్లి రూ.3వేల నుంచి రూ.800కు పతనం



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి ఉల్లి పెద్ద ఎత్తున ఆంధ్ర రాష్ట్రంలోకి వస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజల అవసరాలను తీర్చేందుకు ఆ రాష్ట్ర వ్యాపారులు పెద్ద ఎత్తున ఉల్లిని సరఫరా చేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి ఉల్లి రావడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి పంటను సాగు చేస్తున్న రైతుల పరిస్థితి దీనంగా మారిపోయింది. అక్టోబరులో భారీ ఎత్తున ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు ఉల్లిని తీసుకొచ్చారు. అప్పట్లో మహారాష్ట్రలో భారీ వరదల కారణంగా ఉల్లి పంట పూర్తిగా దెబ్బతినడంతో కర్నూలు ఉల్లికి పెద్ద ఎత్తున డిమాండ్ వచ్చింది. ఆ నెలలో ప్రతిరోజు 6వేల నుంచి 10వేల క్వింటాళ్ల దాకా ఉల్లిని రైతులు అమ్మకానికి తెచ్చారు. అయినా కూడా రైతులకు ధర లాభసాటిగా అందింది. క్వింటా ఉల్లి గరిష్టంగా రూ.3వేల నుంచి రూ.4వేలు కనిష్టంగా రూ.1000 నుంచి రూ.1,500 అందింది. ప్రస్తుతం కర్నూలు మార్కెట్ యార్డుకు ఉమ్మడి జిల్లాలోని రైతులు వేయి క్వింటాళ్లలోపే ఉల్లిని అమ్మకానికి తీసుకువస్తున్నారు. మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున ఉల్లి దిగుమతి అవుతుండటంతో స్థానికంగా పండించే ఉల్లికి ధర తగ్గుతోంది. క్వింటా ఉల్లికి గరిష్ఠంగా రూ.800 మాత్రమే వస్తోంది. దీంతో కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా అందడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో 'గుడ్‌ఫ్రైడే'


ఆదోనిలో సిలువను మోస్తున్న పాస్టర్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మానవజాతిని సన్మార్గం వైపు నడిపించేందుకే క్రీస్తు ప్రభువు సిలువ మరణం చెందారని, ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి ఆచరణీయమని క్రైస్తవ మత పెద్దలు ఉద్బోధించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను పవిత్ర ఆరాధనలు, ప్రార్థనల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిలలో మత పెద్దలు గుడ్‌ఫ్రైడే సందేశాన్ని వినిపించారు. గుడ్ ఫ్రైడే ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. దైవ కుమారుడైన క్రీస్తు ఈ లోకంలోని పాపులను రక్షించేందుకు వచ్చారని అన్నారు. కర్నూలు నగరంలోని సీఎస్ఐ చర్చి, కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి, గిప్సన్ చర్చి, బిషప్ చర్చిలతోపాటూ వివిధ క్రైస్తవ మందిరాల్లో గుడ్‌ఫ్రైడేను నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే రోజున సిలువ మరణం చెందిన క్రీస్తుప్రభువు పునరుత్థానుడై తిరిగి ఆదివారం జన్మించిన వేడుక 'ఈస్టర్' వేడుకను ఆదివారం క్రైస్తవులు నిర్వహించుకోనున్నారు.

## ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ బదిలీ


టి.శ్రీనివాసులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సర్వశిక్ష అభియాన్(ఎస్‌ఎస్‌ఏ) ఏపీసీగా పనిచేస్తున్న టి. శ్రీనివాసులు బదిలీ అయ్యారు. రాష్ట్ర పర్యాటక, సినిమోటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఓఎస్‌డీగా నియమితులయ్యారు. ఈనెల 17వ తేదీన శ్రీనివాసులు రాష్ట్ర సచివాలయంలోని మంత్రి దుర్గేష్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది జనవరి 4వ తేదిన శ్రీనివాసులు ఎస్‌ఎస్‌ఏ ఏపీసీగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన బదిలీతో ఏర్పడిన ఖాళీ స్థానంలో ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు.

## ఎనర్జీ ప్రాజెక్టు వరం

- మారనున్న ఉమ్మడి కర్నూలు జిల్లా రూపురేఖలు
- గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు అద్భుతం
- పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వ ఆర్థిక విధానాలు
- కేంద్ర పునరుత్పాదశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి


పరిశీలిస్తున్న కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి

కర్నూలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టుతో ఉమ్మడి కర్నూలు జిల్లా రూపురేఖలు మారిపోతాయని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. దేశంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ఓర్వకల్లు మండలం గుమ్మితంతండా, పాణ్యం మండలం పిన్నాపురం ప్రాంతాల్లో గ్రీన్‌కో కంపెనీ 6,680 మెగావాట్లతో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టును గ్రీన్‌కో కంపెనీ నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు దాదాపు పూర్తయింది. త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సన్నాహలు చేస్తున్నారు. అందులో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి శుక్రవారం ఉదయం ఆ ప్రాజెక్టును పరిశీలించారు. రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు టన్నెల్, టర్బైన్స్‌ను పరిశీలించారు. అంతకుముందు ఓర్వకల్లు మండలం గని గ్రామ ప్రాంతాల్లో నిర్మించిన సోలార్ ప్రాజెక్టును రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా గ్రీన్ కో కంపెనీ ఎండీ చలమలశెట్టి అనిల్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. అప్పర్ డ్యాం, లోయర్ డ్యామ్, టన్నెల్‌ను మంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్మాణం అద్భుతమని, ప్రపంచంలోనే తొలి ప్రాజెక్టు ఇదే కావడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీ బైరెడ్డి శబరి, చలమలశెట్టి అనిల్ కుమార్‌తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన రెన్యువబుల్ ఎనర్జీ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు ఇదేనని అన్నారు. ఒకే ప్రాంతంలో సోలార్, విండ్ జలవిద్యుత్ కేంద్రాలను నిర్మించడం గొప్పతనమన్నారు. ఒకప్పుడు ఎందుకూ పనికిరాని అటవీభూముల్లో దేశానికి గర్వకారణమైన ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు దార్శనిక నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు. ఓర్వకల్లు ప్రాంతం ఆర్థికవృద్ధిని పెంచుతుందని, మరిన్ని అనుబంధ పరిశ్రమలు రాబోయే అవకాశాలు ఉన్నాయనీ తెలిపారు.

మిగతా 7వ పేజీలో

## గాలివాన బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.. విరిగి పడ్డ చెట్లు
- అంధకారంలో పలు గ్రామాలు
- పంటల్లోకి చేరిన నీరు

పాములపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో గాలివాన బీభత్సానికి భారీ వృక్షాలు నెలకొరిగాయి. ప్రహరీ గోడలు కూలిపోయాయి. రేకుల షెడ్లు పడిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చేతికి వచ్చిన పంటలు నీటి పాలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం పాములపాడు మండలంలో వీచిన భీకరమైన గాలులతో పాటు అకాల వర్షం కురిసింది. ఈదురు గాలులకు మిట్టకందాల ఇస్కాల, రుద్రవరం, పాములపాడు గ్రామాల్లో 20కి పైగా కరెంటు స్తంభాలు నేల కొరగడంతో విద్యుత్ అధికారులు గ్రామాలలో కరెంటు సరఫరా నిలిపివేశారు. దీంతో గ్రామాలు అంధకారంలోకి వెళ్లాయి. విద్యుత్ అధికారులు దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. పాములపాడులో కేజీ రోడ్డుపై విద్యుత్ స్తంభంపై చెట్టు విరిగి పడటంతో సరఫరాకు అంతరాయం కలగటంతో పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రహరీ కూలి పోయింది. ఎస్సీ కాలనీలో, ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద, అలాగే పలు చోట్ల వృక్షాలు నేల కొరిగాయి. అలాగే రైతులు ఆరబోసుకున్న మొక్కజొన్న, మిరప, కందులు తదితర పంటలు అకాల వర్షానికి తడిసి ముద్దవ్వడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పాములపాడుకు చెందిన రైతు సాయికృష్ణకు చెందిన 60 క్వింటాళ్ల కందులు తడిసి ముద్దయ్యాయి.


పాములపాడులో కరెంటు తీగలపై విరిగి పడ్డ చెట్టు


కొత్తపల్లి: మోకాల్లోతు నీటిలో వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు)

**కొత్తపల్లి:** మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు అకాల వర్షం కురిసింది. 20.04 ఎంఎం వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా కొత్తపల్లి, గువ్వలకుంట్ల, బండినాయునిపాలెం, లింగాపురం, సింగరాజుపల్లి, శివపురం, దుద్యాల, నందికుంట తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వాన కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో ఇళ్లపై ఏర్పాటు చేసుకున్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. కొత్తపల్లి బస్టాండు సెంటరులో మోకాల్లోతులో వర్షం నిల్వగా పారింది. దీంతో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది.

**మిడుతూరు:** మిడుతూరు నుంచి నందికొట్కూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో పెట్రోల్ బంకు దగ్గర రోడ్డుపై అడ్డంగా కానుగ చెట్టు విరిగి పడింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే రాత్రి ఓ యువకుడు నందికొట్కూరు నుంచి మిడుతూరు బైకుపై వస్తూ విరిగిపడ్డ పడిన చెట్టును ఢీకొనడంతో గాయపడ్డాడు. 108 వాహనంలో ఆ యువకుడిని నందికొట్కూరు తరలించారు.


మిడుతూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా విరిగి పడిన చెట్టు

**జూపాడుబంగ్లా:** మండలంలోని తంగడంచ, జూపాడుబంగ్లా గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. జూపాడుబంగ్లాలోని కాసానగర్, పోలీసుస్టేషన్ వద్ద, తంగడంచలో విద్యుత్తు తీగలపై చెట్టు విరిగిపడటంతో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

## అహోబిలంలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి


కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కి స్వాగతం పలుకుతున్న జిల్లా అధికారులు, ఆలయ అర్చకులు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు, పాణ్యం మండలాల పర్యటన అనంతరం కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అహోబిలం లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అహోబిలానికి చేరుకున్న కేంద్ర మంత్రిని కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాతో పాటు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆయన ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లో లక్ష్మీ నరసింహస్వామి, అమృత వల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రంగమండపంలో వేదపండితులు కేంద్రమంత్రికి చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆళ్లగడ్డ సీఐలు మురళీధర్‌రెడ్డి, యుగంధర్ బందోబస్తును పర్యవేక్షించారు.

# ఎనర్జీ ప్రాజెక్టు వరం



మాట్లాడుతున్న కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి


(5వ పేజీ తరువాయి)

స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి, నిల్వ, డిమాండ్‌కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి ఈప్రాజెక్టు లక్ష్యమన్నారు. పర్యావరణ వనరులు దెబ్బతిన కుండా విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రస్తుత భారతదేశానికి ఎంతో అవసరమని తెలిపారు.

### పేదరిక నిర్మూలనే లక్ష్యం

విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ పదేళ్ల క్రితం దేశంలో 18,700 గ్రామాలకు కరెంటు అన్నది తెలియదని, ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక పల్లెపల్లెకు కరెంటు సౌకర్యం కల్పించామన్నారు. పీఎం సూర్యఘర్ ద్వారా పేదలకు తక్కువ చార్జిలకు విద్యుత్ విని యోగించుకునే అవకాశం తీసుకువచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ప్రజలు పేదరికం నుంచి బయట పడుతున్నారని, ఆ దిశగా ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నామని వివరించారు. నీటిని మళ్లీ విని యోగించుకొని విద్యుత్ ఉత్పత్తి చేయడం గొప్ప విధానమని కొనియాడారు. ఇలాంటి యూనిట్ల వల్ల దేశం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఇలాంటి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానిస్తుందని గుర్తు చేశారు. ఓర్వకల్లు మండలంలోని గ్రీన్‌కో కంపెనీ నిర్మాణం చేసిన ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు 60 సంవత్సరాలు పైగా పని చేసే సామర్థ్యం ఉందని త్వరలోనే పూర్తి సామర్థ్యంతో పని చేస్తుందని వివరించారు. కేవలం సోలార్ విద్యుత్‌పైనే ఆధారపడకుండా గాలిమర విద్యుత్, నీటిని ఉపయోగించుకుని విద్యుత్ వినియోగించుకోవాలనే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 4వేల మెగా వాట్ల సౌర విద్యుత్, వెయ్యి మెగావాట్ల పవన విద్యుత్, 1,680 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. గ్రీన్‌కో కంపెనీ హైడ్రోజన్ పవర్‌గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులపై పని చేస్తున్నారనీ, దేశంలోని 20 రాష్ట్రాల్లో ఈ సంస్థ వీటిని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ ఎంపీ సుధాకర్ రెడ్డి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఇన్‌చార్జి అంకాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రక్షాళనే లక్ష్యం..!




- సచివాలయ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం తొలిఅడుగు
- మూడు కేటగిరీలుగా సచివాలయల వర్గీకరణ
- కేటగిరీల వారీగా ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- డీడీఓలపై తొలగని సందిగ్ధత
- అదనపు ఉద్యోగుల పరిస్థితి ప్రశ్నార్థకం

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా అస్తవ్యస్తంగా తయారైన గ్రామ, వార్డు సచివాలయాలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు గాడిన పెట్టింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో భారీ మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న లక్ష్యంతో పాటు పాలనలో ప్రక్షాళన దిశగా ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. ముందుగా ఉద్యోగుల హేతుబద్ధీకరణపై కసరత్తు చేస్తున్నారు. గ్రామ, పట్టణాల్లో నివాస గృహాలు, కుటుంబాల మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. జనాభా సేకరించి నివేదికలు తయారు చేశారు. ఈ క్రమంలో త్వరలో క్లస్టర్ల విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రస్తుత క్లస్టర్ విధానంలో భాగంగా ప్రతి 2,500 మంది లోపు జనాభా ఉంటే 'ఏ' కేటగిరీ కిందకు చేర్చి సేవలను ఆరుగురు ఉద్యోగులతో కొనసాగిస్తారు. 2,501 నుంచి 3,500 వరకు జనాభా ఉన్న క్లస్టర్‌ను పరిగణలోకి తీసుకుని 'బీ' కేటగిరిలోకి తీసుకువచ్చి అక్కడ ఏడుగురు ఉద్యోగులను కేటాయిస్తారు. ఇక 3,501 మందికి పైగా ఎంతమంది ఉన్నా 'సీ' విభాగంలోకి మార్పు చేస్తారు. ఈ క్లస్టర్లలో 8-10 మంది సిబ్బంది పనిచేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు.

### డీడీఓగా ఎవరుండాలి..?

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించి జీతభత్యాలు చెల్లించే డీడీఓగా ఎవరు ఉండాలన్న అంశంపై సందిగ్ధత నెలకొంది. జీఓ నంబర్ 11 ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాలి. నిజానికి సచివాలయంలో పనితీరు భిన్నంగా ఉంటోంది. ఇందులో పని చేస్తున్న కొంత మంది సిబ్బందికి ఎలాంటి పని లేకపోగా.. మరికొందరు సిబ్బంది విపరీతమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. కొందరికి సరైన జాబ్ చార్ట్ లేకపోవడం, మరికొందరికి పదోన్నతుల చానెల్ లేకపోవడం వంటి లోపభూయిష్ట పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో జీఓ.నెం.3 ద్వారా సచివాలయాలను ఏ,బీ,సీ కేటగిరీలుగా వర్గీకరించారు. సిబ్బందిని కూడా జనరల్ పర్సన్, స్పెసిఫిక్ పర్సన్ పేరిట వర్గీకరించారు. కాగా ఈ హేతుబద్ధీకరణ ప్రక్రియలో కొంత సందిగ్ధత నెలకొంది. జీఓ.నెం.11 ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాలి. కాగా ఈ హేతుబద్ధీకరణ ప్రక్రియలో ఏ కేటగిరీ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి లేదా డిజిటల్ అసిస్టెంట్లలో ఒకరు మాత్రమే ఉంటారు. దీని వల్ల సచివాలయానికి జీతభత్యాలు చెల్లించే డీడీఓగా ఎవరు వ్యవహరిస్తారనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం జీఓ ప్రకారం అక్కడ పంచాయతీ కార్యదర్శులు ఉండరు. ఇది రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన గ్రామ పంచాయతీకి కార్యనిర్వహణాధికారి లేకుండా చేయడమే అవుతుంది. ఈ విషయంపై స్పష్టత కావాలని పంచాయతీ కార్యదర్శులు సంఘాలు కోరుతున్నాయి. గత ప్రభుత్వంలో సచివాలయాల నిర్వహణ భారం పూర్తిగా గ్రామ పంచాయతీలపై పడింది. విద్యుత్, ఇంటర్నెట్ బిల్లు, స్టేషనరీ, పరిపాలన నిర్వహణ వ్యయం గ్రామ పంచాయతీ చెల్లించేది. దీంతో తీవ్ర నిధుల కొరత ఎదురైంది. దీనికి పరిష్కారంగా సచివాలయాలను గ్రామ పంచాయతీ వ్యవస్థ నుంచి తప్పించాలని వారు కోరుతున్నారు.

### రూపు కోల్పోయిన 'గ్రామ పంచాయతీ'

ఇప్పటికే గ్రామ పంచాయతీ భవనాలు రూపు కోల్పోయి సచివాలయాలుగా అవతరించాయి. పంచాయతీ కార్యదర్శి కొలువు పూర్తిగా క్షేత్రస్థాయి పర్యటనలతో ముడిపడి ఉంటుంది. డిజిటల్ అసిస్టెంట్ల పని కార్యాలయ విధి నిర్వహణతో కూడి ఉంటుంది. వీరిద్దరిలో ఒకరు మాత్రమే సచివాలయంలో ఉంటారనీ, మిగిలిన వారు అదనపు సిబ్బందిగా ఉంటారనీ చెప్పడం స్పష్టత లోపించిన అంశం. ఇక ఇటీవల పదోన్నతుల ప్రక్రియ ఆరంభమైన విషయం తెలిసిందే. ఒక గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శి విధానంలో అందరికీ గ్రామ పంచాయతీ కేటాయించినప్పటికీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 44 మంది అదనపు పంచాయతీ కార్యదర్శులు మిగిలిపోయారు. ఇక్కడ ఇప్పటికే ఒక పంచాయతీ కార్యదర్శి పని చేస్తున్నారు. పదోన్నతుల తర్వాత అదనంగా మిగిలిన వీరికి గ్రామ పంచాయతీలు కేటాయించాల్సి ఉంది. కానీ అలా కాకుండా డిజిటల్ అసిస్టెంటుగా ఉనన వారికి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి కల్పించి గ్రామ పంచాయతీలు కేటాయిస్తే ఈ అదనంగా మిగిలి ఉన్న పంచాయతీ కార్యదర్శుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ విషయాలు చక్కదిద్దితే హేతుబద్ధీకరణ సవ్యంగా సాగుతుంది. ఇక ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల పదోన్నతుల విషయంలో కమిషనర్ వారి కార్యాలయం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతానికి ఉన్న ఖాళీలతో పదోన్నతులు ఇవ్వాలని పేర్కొంది. అదనంగా మిగులు ఖాళీ ఏర్పడితే రెండో విడతలో ఖాళీలు భర్తీ చేసుకోవచ్చని స్పష్టం చేసింది. దీని వల్ల పంచాయతీ కార్యదర్శులు త్వరితగతిన పదోన్నతులు కల్పించాలని ఉన్నతాదికారులను అభ్యర్థిస్తున్నారు.

### ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేస్తాం



గ్రామ, వార్డు సచివాలయ హేతుబద్ధీకరణ నిబంధనలను ప్రభుత్వం రూపొందిస్తుంది. కమిషనర్ ఉత్తర్వుల అనుసరించి గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లను విభజించడం జరుగుతుంది. ఏ-కేటగిరి గ్రామ వార్డు సచివాలయంలో డీడీఓ అధికారులను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

- భాస్కర్, డీపీఓ, కర్నూలు



# టీటీడీని భ్రష్టు పట్టించిన వైసీపీ

### బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ టీటీడీని భ్రష్టుపట్టించిందని టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మండలంలోని హుశేనాపురం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో టీటీడీ గోసంరక్షణ శాలలో జరిగిన ఘోరాలు అన్నీఇన్నీ కావన్నారు. చనిపోయిన ఆవులు, దూడలను నిర్ధాక్షిణ్యంగా చెత్త బుట్టలో పారేశారన్నారు. చాలా చోట్ల గోవులు లేకుండానే దాణా కొనుగోలు అంటూ భారీ ఎత్తున అవినీతి చేశారని ఆరోపించారు. చాలా చోట్ల గోవులు లేకుండానే దాణా కొనుగోలు అంటూ భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. గోవులకు నాసిరకం దానా, కాలం చెల్లిన మందులు ఇచ్చి నోరు లేని మూగజీవాల ప్రాణాలను వైసీపీ ప్రభుత్వం తీసుకుందన్నారు. గోవులు మరణించిన ఆ లెక్కలు బయటకు పొక్కకుండా తొక్కి పెట్టారని, ఈ అరాచకాలకు అప్పటి గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డినే బాధ్యుడు అని అన్నారు. అక్రమాలు బయట పడుతాయన్న ఉద్దేశంతో విజిలెన్స్ అధికారులను గోశాలలోకి రాకుండా ఇష్టానుసారం వ్యవహరించారన్నారు. జగన్ పాలనలో టీటీడీ ఐటీ వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. భక్తులకు సేవలందించేందుకు అంతర్గత పాలన సక్రమంగా నిర్వహించేందుకు కీలక విభాగాల్లో జనరల్ మేనేజర్ పోస్టును వైసీపీ అనుకూల వర్గానికి అర్హత లేని వ్యక్తికి ఇచ్చిందని ఆరోపించారు. టీటీడీ బోర్డు మాజీ ఛైర్మన్ భూమన కరుణకర్ రెడ్డి గోవులు మరణించాయని ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కేవీ మధు, జీకే సుధాకర్, మహబూబ్ బాషా, గువ్వ రవికుమార్, బజారు, తదితరులు ఉన్నారు.

### పిడుగుపాటుకు వ్యక్తి మృతి

బనగానపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం గ్రామానికి చెందిన పండ్లాపురం బషీర్ అహమ్మద్ (45) శుక్రవారం పిడుగుపాటుకు పొలంలోనే మృతి చెందారు. వివరాలు.. బషీర్ అహమ్మద్ మొక్కజొన్న పంట వేసిన తర్వాత భార్య ఖాజాబీతో, మరికొంత మంది కూలీలతో మొక్కజొన్న పొలంలో చెత్తా చెదారం ఏరివేయడానికి వెళ్లారు. భార్య, కూలీలు చెత్త ఏరి కుప్పలు పెడుతుండగా బషీర్ అహమ్మద్ మొక్కజొన్న కుప్పలకు మంట పెడుతూ కాల్చివేస్తున్నారు. ఈసమయంలో ఒక్కసారిగా భారీగా ఉరుములు, మెరుపులు రావడంతో పాటు పిడుగు పడడంతో పొలంలోనే బషీర్ అహమ్మద్ కుప్పకూలి మృతి చెందారు. ఒక్కసారిగా భర్త పొలంలో మృతి చెందడంతో ఖాజాబీ, వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

### ఆత్మహత్యకు యత్నిస్తున్న

## మెడికోను కాపాడిన ట్రైనీ ఐపీఎస్

రామచంద్రాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం పీపీపురం సమీపంలోని మామిడితోటలో ఆత్మహత్యకు యత్నిస్తున్న మెడికోను ట్రైనీ ఐపీఎస్ హేమంత్ గురువారం రాత్రి 10 గంటలకు కాపాడారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. నంద్యాలకు చెందిన ఓ విద్యార్థి తిరుపతిలో వైద్య విద్య చదువుతున్నాడు. పీపీపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న మామిడి తోటలో ఆత్మహత్య చేసుకుంటానని గురువారం సాయంత్రం తన స్నేహితులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. వీరిచ్చిన సమాచారంతో రామచంద్రాపురం పోలీసులు స్పందించారు. ఆ మెడికో లొకేషన్‌ను ట్రేస్ అవుట్ చేసి 20 నిమిషాల్లో సిబ్బందితో కలిసి ట్రైనీ ఐపీఎస్ హేమంత్ ఘటనా స్థలానికి చేరుకుని ఆ విద్యార్థి ప్రాణాలను కాపాడారు. అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తిరుపతిలో ఆ విద్యార్థి సమీప బంధువు ఉండటంతో ఆయన్ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు.

# మహనీయుల సేవలు చిరస్మరణీయం


సీడీ ఆవిష్కరిస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన జీయర్ స్వామీజీలు

### ఆధ్యాత్మిక సదస్సులో జీయర్ స్వామీజీలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించిన మహనీయులు ఈ సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు జీయర్ స్వామీజీలు ఉద్బోధించారు. జ్ఞానం, అనుష్ఠానం కలిగిన మహామహులు సదాచార్యులుగా మనకు దొరకడం అదృష్టమని కొనియాడారు. కర్నూలు నగర శివారు మామిదాలపాడులో వెలసిన గోదా రంగనాథస్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రం)లో మహా మహోపాధ్యాయ శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్య స్వామి శతజయంతి వేడుకలు ఘనంగా ముగిశాయి. జయంతి వేడుకల్లో పాల్గొన్న జీయర్ స్వామీజీలు మాట్లాడుతూ భగవద్రామానుజ సంప్రదాయ పరిరక్షణ, సంస్కృత, ద్రావిడ వేదాంతముల ప్రచారమే లక్ష్యంగా రఘునాథాచార్యులు జీవన యానాన్ని కొనసాగించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి (భీమవరం), త్రిదండి అహోబల రామానుజ జీయర్ స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి (సమతామూర్తి, ముచ్చింతల్), త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామిజ (విజయవాడ), త్రిదండి అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామి, త్రిదండి శఠగోపముని రామానుజ జీయర్ స్వామి (అభినవ మేల్కోట, కర్ణాటక), త్రిదండి ప్రసన్న రాఘవ రామానుజ జీయర్ స్వామి (ప్రయాగరాజ్), ఆచార్య పరమాత్మ నంమదగిరి స్వామి (గంగాపురం), విరజానంద స్వామి (తోట్లపల్లి) భక్తులకు ప్రవచన బోధ చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతల నుంచీ శాస్త్ర పండితులు, వైష్ణవ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గోదా రంగనాథ రామానుజ కూటమి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# సీమపై ప్రభుత్వ వైఖరిని ఎండగడతాం

- రాయలసీమ సాగునీటి సాధన సమితి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమపై ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా మే 31న సిద్ధేశ్వరంలో జరిగే ప్రజా బహిరంగ సభకు తరలిరావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సిద్ధేశ్వరం ఉద్యమ అనంతరం అలుగు నిర్మాణానికి సానుకూల సందేశాలిస్తూ గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల, ఆర్డీఎస్ కుడి కాలువ తదితర నిర్మాణాల శంకుస్థాపన, హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పుకు పాలనా పరమైన అనుమతులు ఇచ్చిన పాలకులు వాటి పురోగతిపై నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. తెగిన అలగనూరు, అన్నమయ్య ప్రాజెక్టులపై సైతం ప్రతిపాదనలతోనే ప్రభుత్వం కాలం వెళ్లిబుచ్చుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటం సీమపై ప్రభుత్వ శీతకన్నుకు నిదర్శనమని అన్నారు. ఎన్టీఆర్ మానస పుత్రిక తెలుగు గంగ ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా ఉండటం సీమ పట్ల పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. జలమే జీవం.. జలమే సర్వం అని చెప్పిన ముఖ్యమంత్రి కరువు, వలసలతో సహజీవనం చేస్తున్న రాయలసీమ ప్రజలను సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేసి కాపాడాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి, సామాజిక విశ్లేకుడు గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, యాగంటి బసవేశ్వర రైతు సంఘం కన్వీనర్ ఎంసీ కొండారెడ్డి, రైతు నాయకులు శ్రీహరి, నిట్టూరు సుధాకర్ రావు, అలగనూరు రిజర్వాయర్ పరిరక్షణ సమితా నాయకులు ఈశ్వర రెడ్డి తదీతరులు పాల్గొన్నారు.

# ఏపీఎస్పీ కానిస్టేబుల్ హత్య

- నల్లమల అటవీ ప్రాంతంలో లభ్యమైన మృతదేహం
- పోలీసుల అదుపులో నిందితులు


ఫరూక్ (ఫైల్)

శిరివెళ్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలో దారుణ హత్యకు గురైన ఓ కానిస్టేబుల్ మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన ఫరూక్(36) కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలి యన్ లో(2013 బ్యాచ్) కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం మంగళగిరి హెడ్ క్వార్టర్స్‌లో ఏపీఎస్పీ(ఆక్టోపస్ విభాగం) కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈనెల 8వ తేదీన స్వగ్రామమైన పెద్ద కందుకూరుకు వెళ్తున్నట్లు కానిస్టేబుల్ ఫరూక్ మంగళగిరిలో సెలవు పెట్టి వెళ్లారు. ఫరూక్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు మంగళగిరికి వెళ్లి విచారించారు. కానిస్టేబుల్ ఫరూక్ వ్యక్తిగత సెలవుపై వెళ్లినట్లు అక్కడి అధికారులు చెప్పడంతో వారు ఆందోళనకు గురయ్యారు. దీంతో వారు మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

**మృతదేహమై తేలిన కానిస్టేబుల్ :** మంగళగిరిలో నమోదైన కానిస్టేబుల్ మిస్సింగ్ కేసును పోలీసులు నంద్యాల పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ వేగవంతం చేశారు. నంద్యాల శివారులోని ఓ ప్రాంతంలో ఓ మహిళతో కానిస్టేబుల్ ఫరూక్‌కు వివాహేతర సంబంధ ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. దీంతో కొందరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నిజాలు వెల్లడైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నంద్యాల ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు ఆళ్లగడ్డ-చాగలమర్రి రహదారి మధ్యలో ఫరూక్‌ను హతమార్చి మృతదేహాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. మృతదేహాన్ని అదే రహదారిలోని ఓ గోతిలో పడేసి వెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తారన్న భయంతో తిరిగి మృతదేహాన్ని నంద్యాల-గిద్దలూరు అటవీ ప్రాంతంలో వంతెన కింద పడేసి వెళ్లినట్లు దర్యాప్తులో తెలుసుకున్నారు. దీంతో కానిస్టేబుల్ మృతదేహాన్ని పోలీసులు పంచానామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కానిస్టేబుల్ దారుణ హత్యకు గురవ్వడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నంద్యాల ప్రభుత్వ వైద్యశాల వద్ద మృతుని భార్య, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఫరూక్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

## రోడ్డు నిర్మాణం చేపట్టాలి


రోడ్డును పరిశీలిస్తున్న క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు

**కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):** నగర పాలక పరిధిలోని అనంత కాంప్లెక్స్ ఎదురుగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కర్నూలు క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచపూడి సాయిబాబా అన్నారు. శుక్రవారం పాతబస్టాండు సమీపంలోని రాధాక్రిష్ణ టాకీస్ నుంచి బొంగుల బజారు వెళ్లే దారిలో కంకర తేలని రోడ్డును పరిశీలించారు. కాంప్లెక్స్ ఎదుటగా ఏడాది క్రితం వేసిన రోడ్డు కంకర తేలి గుంతలు పడిందన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ డీఎస్ అబ్దుల్లా ప్రవీణ్, ప్రసాద్, నితిన్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## 'ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి'

**కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మికవర్గ వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ వేర్‌హౌస్ హమాలీ యూనియన్ కార్యకర్తల సమావేశం కేకే భవన్‌లో యూనియన్ అధ్యక్షుడు విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగింది. అంజిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో మల్లికార్జున, ఈ.విజేయుడు, మధు, పురుషోత్తం పాల్గొన్నారు.

## వర్షపు నీరు నిల్వకుండా చర్యలు

**కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):** నగరంలోని అశోక్‌నగర్ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కింద వర్షం పడినప్పుడు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం అక్కడ జరుగుతున్న మురుగు కాలువల పునరుద్ధరణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల వర్షం కురిసినప్పుడు అశోక్‌నగర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐబీఈఏ వ్యవస్థాపక వేడుకలు

**కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):** ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) 80వ వ్యవస్థాపక దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కర్నూలు క్లబ్‌లో అసోసియేషన్ సభ్యులు కుటుంబ సభ్యులకు ఆటల పోటీలను నిర్వహించారు. క్యారమ్స్, చెస్, షటిల్, లెమన్‌అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలను ఏర్పాటు చేశారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సెక్రటరీ మక్బూల్, ప్రధాన కార్యదర్శి శివకృష్ణ, అజయ్, వాసుదేవరెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డును శుభ్రంగా ఉంచుతాం


మార్కెట్ యార్డులో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం

**కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు మార్కెట్ యార్డును పరిశుభ్రంగా ఉంచుతామని మార్కెట్‌యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధి నుంచే గాకుండా కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా పంట ఉత్పత్తులను అమ్మేందుకు వేలాది మంది రైతులు కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకొస్తున్నారన్నారు. మార్కెట్ యార్డులో చెత్తాచెదారంతో కంపు కొడుతుండడంతో కొంత మంది రైతులు జయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి శుక్రవారం ట్రాక్టర్ల ద్వారా చెత్తచెదారాన్ని తొలగించారు. యార్డులో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్, అకౌంటెంట్ కిషన్ రెడ్డి పాల్గొన్నారు.






హోసన్న మందిరంలో గుడ్‌ఫ్రైడే సందేశం ఇస్తున్న బ్రదర్ ఫ్రెడ్రిక్ పాల్


సి.క్యాంపు చర్చిలో దైవ సందేశం ఇస్తున్న పాస్టర్ గంటా కరుణాసాగర్

# ఘనంగా గుడ్‌ఫ్రైడే

**కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కర్నూలు నగరంలోని అన్ని చర్చీల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మానవజాతిని సన్మార్గం వైపు నడిపించేందుకే క్రీస్తు ప్రభువు శిలువ మరణం చెందారని, ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి ఆచరణీయమని, ఆయన చూపిన మార్గములో ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని పలువురు క్రైస్తవ మత పెద్దలు ఉద్బోధించారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాల్లోని అన్ని క్రైస్తవ ఆలయాల్లో గుడ్‌ఫ్రైడేను పవిత్ర ఆరాధనలు, ప్రార్థనల మధ్య నిర్వహించారు. ఆయా చర్చీల్లో మత పెద్దలు గుడ్‌ఫ్రైడే సందేశాన్ని వినిపించారు. గుడ్‌ఫ్రైడే ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. దైవ కుమారుడైన క్రీస్తు ఈలోకంలోని పాపులను రక్షించేందుకు వచ్చారని అన్నారు. మానవుల పాపాలను ఆయన దేవునికి అప్పగించకుండా, మానవాళి పాపాలను ఆయనే సిలువ నుంచి కడిగివేశారని చెప్పారు. ఈ సందర్భంగా యేసు క్రీస్తు సిలువపై నుంచి పలికిన ఏడు మాటల విశిష్టతను మత పెద్దలు వివరించారు. గుడ్‌ఫ్రైడే వేడుకలో భాగంగా క్రైస్తవులు దైవారాధనలు, దైవ ప్రార్థనలతో ఉపవాసాలు పాటించారు. నగరంలోని ప్రార్థన మందిరంలో పాస్టర్ గంటా కరుణాసాగర్, ఆర్ఎస్ రోడ్డులోని యెహోవా షమ్మా చర్చిలో డాక్టర్ ఆర్ ప్రశాంతి శ్యామ్, హోసన్న మందిరంలో పాస్టర్ ఫ్రెడ్రిక్ పాల్, ఆర్ఎస్ రోడ్డులోని రాక్‌వుడ్ చర్చిలో ఈస్టర్ కమిటీ కన్వీనర్ ఆనంద రావు, పాస్టర్లు విజయరాజు, కిషోర్, డాక్టర్ బీవీ స్వరూప్‌సిన్హా, స్టెల్లా కిరణ్‌పాల్, సరోజిని ఆనంద్, జోసెఫ్ మనోహర్, బెంజిమెన్ రాజులు క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటల ప్రాధాన్యతను తెలియజేశారు. నగరంలోని సీఎస్ఐ చర్చి, కోల్స్ సెంటినియల్ తెలుగు బాప్టిస్టు చర్చి, గిప్పన్ చర్చి, బిషప్ చర్చిలతోపాటూ వివిధ క్రైస్తవ మందిరాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలో ఆయా చర్చిల ప్రతినిధులు దైవ సందేశాన్ని, గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు.

● **రేపు ఈస్టర్**

గుడ్‌ఫ్రైడే రోజున సిలువ మరణం చెందిన క్రీస్తుప్రభువు పునరుత్థానుడై తిరిగి ఆదివారం జన్మించిన వేడుక 'ఈస్టర్' వేడుకను ఆదివారం క్రైస్తవులు నిర్వహించుకోనున్నారు. క్రీస్తు ప్రభువు మరణాన్ని జయించి పునరుత్థానుడై వచ్చిన సందర్భంగా ఈస్టర్ వేడుకను ఆనందోత్సాహంతో జరుపుకోనున్నారు. జిల్లాలోని క్రైస్తవ ఆలయాల్లో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, దైవ సందేశాలను మత పెద్దలు అందించనున్నారు.

**సి. బెళగల్:** మండలంలోని బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, పోలకల్లు, కొత్తకోట, ఈర్లదిన్నె, శింగవరం, ముడుమాల, కొండాపురం, గుండ్రేవుల, సంగాల, తిమ్మనదొడ్డి, చింతమానుపల్లె, పలుకుదొడ్డి, కంబంధహల్, ఇనగండ్ల, గొల్లలదొడ్డి, బ్యాదోలి, పల్దొడ్డి గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజి ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటీసీ, సర్పంచులు, ఆయా గ్రామాల సంఘ పెద్దలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


రాక్‌వుడ్ చర్చిలో గుడ్‌ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న సంఘపెద్దలు


సి.బెళగల్‌లో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

## వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి


గూడూరులో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

**కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) :** వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని సీపీఎం నాయకులు ఎస్ఎండి షరీఫ్, అబ్దుల్ దేశాయ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండిబజార్ నుంచి కేవీఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ హిందూ దేవాలయాల్లో కూడా ముస్లింలకు సభ్యులుగా చేరుస్తారా అని ప్రశ్నించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా 28 ఉస్మానియా కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ, 30న రాత్రి 9 నుంచి 9.30 వరకు బిజిలీ బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పి.మునీర్ అహ్మద్, ఆవాజ్ నగర అధ్యక్షకార్యదర్శులు పి.ఇక్బాల్ హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

**గూడూరు:** వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. శుక్రవారం గూడూరులో ముస్లింలు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ముస్లింల హక్కులను కాలరాస్తూ ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


నాటు సారాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

**ఓర్వకల్లు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గుమితం తండా, గుడుంబాయితండా గ్రామాల్లో శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుమితం తాండాల్లో 400 లీటర్ల బెల్లం ఊట, 15 లీటర్ల నాటుసారాను స్వాదీనం చేసుకున్నారు. సారాయి లక్ష్మీబాయి, లోకానాయక్‌లను త్వరలో అరెస్టు చేస్తామన్నారు. గుడుంబాయితండాలో దాడులు చేయగా.. 600 లీటర్ల నాటుసారా, బెల్లం ఊటను,1 5 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. సారా విక్రేతలను గుర్తించి అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ దాడుల్లో సీఐ చంద్రహాస్, ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఎస్ఐ మధు, సిబ్బంది రామలింగయ్య, చంద్రపాల్, రామచంద్రుడు, ఈరన్న పాల్గొన్నారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి నాటుసారా పై అవగాహన కల్పించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో నాటుసారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

## 'ఆచార్య తుమ్మల రామకృష్ణ సాహితీ సేవలు స్మరణీయం'


ఆచార్య తుమ్మల రామకృష్ణకు నివాళి అర్పిస్తున్న కేసీ కల్కూర, సాహితీవేత్తలు

**కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** ద్రవిడ యూనివర్శిటీ మాజీ ఉప కులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ తెలుగు సాహితీ రంగానికి చేసిన సేవలు స్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల కన్నుమూసిన ఆచార్య తుమ్మల సంస్మరణ సభ శుక్రవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రం సాహిత్య వేదిక హాలులో నిర్వహించారు. నగరంలోని కర్నూలు కథాసమయం సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభలో తొలుత ఆచార్య తుమ్మల చిత్రపటానికి గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర, తుమ్మ రామకృష్ణ సోదరుడు డాక్టర్ తుమ్మల శ్రీనివాస్, కథా రచయిత జి. ఉమామహేశ్వర్‌లు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. బాలల సాహిత్యవేత్త డాక్టర్ ఎం. హరికిషన్ అధ్యక్షత వహించిన ఈ సభలో తెలకపల్లి మధుసూదన శర్మ మాట్లాడుతూ తుమ్మల స్ఫూర్తితో కథ రాశానని గుర్తు చేసుకున్నారు. సభలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య, కవులు తెలుగు వెంకటేశ్, కల్యాణదుర్గం స్వర్ణలత, రచయితలు ఎస్‌డీవీ అజీజ్, మారుతి పౌరోహితం, డాక్టర్ చంద్రమౌళిని, అవిజ వెంకటేశ్వరరెడ్డి, డీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు రత్నం ఏసేపు, నవీన్, డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సభలో ఎంపీ బసవరాజు, మహమ్మద్ మియా పాటలు ఆకట్టుకున్నాయి.

## శ్రీనగర్ ఎస్పీగా కర్నూలు వాసి


సందీప్ చక్రవర్తి

**కర్నూలు క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) :** శ్రీనగర్ ఎస్పీగా కర్నూలు చెందిన సందీప్ చక్రవర్తి నియమితులయ్యారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసి రిటైర్డు అయిన డా.వేణుగోపాల్ రావు కుమారుడు సందీప్ చక్రవర్తి. ఈయన 2013లో సివిల్స్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. గతంలో శ్రీనగర్ సౌత్‌జోన్ ఎస్పీగా, బారాముల్లా ఎస్పీగా, పూంచ్‌యూరీ సోపోర్ ఏఎస్పీగా పని చేశారు. ఆరుసార్లు పోలీస్ గ్యాలెంటరీ పోలీస్ మెడల్స్‌కు, నాలుగు సార్లు జమ్మూకాశ్మీర్ మెడల్స్‌కు, ఐదు సార్లు సీఆర్‌పీఎఫ్ డీజీపీ కమాండేషన్ పతకాలు, తదితర ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

## ఘనంగా రంగస్థల కళాకారులకు కళాభిషేకం


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హార్మోనిస్టు వెంకటేశ్వర్లు

**కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని మార్కెట్ యార్డు సమీపంలో గల తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం 234వ రంగస్థల కళాకారుల కళాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు అంజనప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన సీనియర్ రంగస్థల నటుడు, ఆలనాటి నటీమణి గూడూరు సావిత్రితో కలిసి నటించిన బీటీ రామచంద్రయ్య, హార్మోనిస్టు పీజీ వెంకటేశ్వర్లు, విశ్వ కళా సమితి అధ్యక్షుడు బీసన్న, పెద్ద అయ్యన్న, తలబిస్తు మారెన్న, గిరెన్నాయుడులకు అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 110 మందికి కందుకూరి పురస్కారాలు అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రంగస్థల కళాకారులకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా తగిన చేయూత ఇవ్వాలని రంగస్థల నటులు, సంగీత గురువులు తదితరులు కోరారు.

## గుంతను పూడ్చండి..



**గూడూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):** స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ఎమ్మిగనూరు వెళ్లే రోడ్డు పక్కనే గుంతను తవ్వి వదిలేశారు. గుంతను పూడ్చాలని అనేక సార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు వెంబడి నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి పూట గుంతను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

## కేంద్ర మంత్రిని సన్మానించిన ఎంపీ బస్తిపాటి


కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూలు అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):** కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కార్యాలయాన్ని సందర్శించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కర్నూలుకు వచ్చిన కేంద్ర మంత్రి ఎంపీ ఆహ్వానం మేరకు కార్యాలయాన్ని సందర్శించారు. మంత్రికి వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం జిల్లాలోని పలు సమస్యలపై కేంద్ర మంత్రికి ఎంపీ నాగరాజు వినతి పత్రం అందజేశారు.

## సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డులు తీసుకోవాలి

**కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):** నగరంలో వయోవృద్ధులు ఐడి కార్డులు తీసుకోవాలని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ శుక్రవారం తెలిపారు. 60 ఏళ్లు పైబడిన పురుషులు, 50 ఏళ్లు పైబడిన మహిళలు సీనియర్ సిటిజన్స్‌గా పరిగణించబడతారని, వారు తమ సచివాలయాల్లో ఐడి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, రూ.40 రుసుము చెల్లిస్తే ఐడీ కార్డు మంజూరు అవుతుందన్నారు. దీని ద్వారా రవాణా సమయంలో, వివిధ సందర్భాల్లో క్యూలైన్‌లు, ఇతరత్రా సమయాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వయో వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఈ -వ్యర్థాల పునర్వినియోగమే మానవాళికి రక్ష

● మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు


మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

**కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):** సమాజంలో పర్యావరణానికి వ్యర్థాలు తీవ్ర హాని కలిగిస్తున్నాయని, వాటిని పునర్వినియోగించడమే మానవాళి మనుగడకి రక్ష అని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక పొట్టిశ్రీరాములు పార్కులో పారిశుధ్య విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రోజురోజుకు వినియోగం పెరుగుతూ, సమాజంలో ముంచెత్తుతున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాల వ్యర్థాలను పూర్తిస్థాయిలో పునశుద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ వ్యర్థాల సేకరణ సురక్షితంగా రీసైకిల్ చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చెత్త నుంచి సంపద సృష్టితోనే సర్క్యులర్ ఎకానమీ సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ ఈఈ పివి.కిషోర్‌రెడ్డి, గ్రీన్ గ్లోబల్ రీసైక్లర్స్ ప్రతినిధులు పవన్, అలోక్, ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

● **నేడు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ**

రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ శనివారం ఈ వ్యర్థాల దుష్ప్రభావాలు, పునర్వినియోగం, వాటి సేకరణకు కౌంటర్లను ఏర్పాటు చేస్తుందని కమిషనర్ తెలిపారు. అనంతరం అశోకనగర్ పంప్ హౌస్ నుంచి ట్రిబుల్ ఆర్ సెంటర్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు.

## పెండింగ్ ఫీజులను విడుదల చేయాలి


మాట్లాడుతున్న విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి కటికె గౌతమ్

**కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ ఫీజులను వెంటనే చెల్లించాలని వైసీపీ అధికార ప్రతినిధి కటికె గౌతమ్ శుక్రవారం డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజులను చెల్లించాలని కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని అన్నారు. ఈ విధానం విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా ఉందన్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, ఎంబీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించని కారణంగా విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. బకాయిలు మొత్తం 3,900 కోట్లు ఉంటే కూటమి ప్రభుత్వం కేవలం 1300 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. పెండింగ్ ఫీజులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శతాబ్ది బ్రహ్మోత్సవాలు


హంస వాహనంపై సీతారామచంద్ర లక్ష్మణ మూర్తులు

**కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** పాతనగరంలో వన్‌టౌన్ మెయిన్ బజార్‌లోని శ్రీరామాలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి వైభవంగా ముగిశాయి. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, అనంతరం శ్రీరామచంద్ర మూల విరాట్టు అయిన ఏకాంత రామున్ని గంధంతో అలంకరణ చేశారు. 250 కమల పుష్పాలతో మహాలక్ష్మి హోమం సుధాపండితుడు, కడప ఉత్తరాది మఠం మఠాధికారి పండిత విద్యానిధి ఆచార్య చేతుల మీదుగా జరిపించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకుడు మాళిగి హనుమేషాచార్యులు, ఈవో దినేష్‌చౌదరిల ఆధ్వర్యంలో సీతారామచంద్ర లక్ష్మణ ఉత్సవ మూర్తులను హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు సంగీత విద్వాంసురాలు నిర్మలతో రామదాసు కీర్తనలు వీణావాదనం గాన కచేరీ నిర్వహించారు. శతాబ్ది బ్రహ్మోత్సవ అభినందన సభలో పండిత మాళిగి విద్యానిధి ఆచార్య మాట్లాడుతూ వందేళ్ల క్రితం తమ ముత్తాత మాళిగి రామ్మూర్తి ఆచార్య ప్రారంభించిన ఈ బ్రహ్మోత్సవాలు మూడో తరం వారసులు నిర్వహించుకోవడం ఆనందదాయకమని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ స్వాగత సమితి సభ్యులను, ఇతర దాతలను శాలువాలతో, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఉత్సవ చివరగా ఉత్సవమూర్తులకు నాగవేలి, ఊంజల సేవ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయుడు విఠల్‌రావు మాళిగి పావని, సత్యనారాయణమూర్తి, వ్యాసరాజ్, సత్యప్రియ తీర్థ, జయతీర్థ, వేదవ్యాస మూర్తి, సుధాకర్, మాళిగి భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

## రేపు మెగా వైద్య శిబిరం

**ఆదోని టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) :** ఎస్‌కేడీ కాలనీలోని సంస్కృతి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్త తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కిమ్స్ హాస్పిటల్ (కర్నూల్), శాంతిరాం హాస్పిటల్ (నంద్యాల), ఆర్బిట్ డయాగ్నోస్టిక్స్ (అపోలో ల్యాబ్స్), ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) సహకారంతో, ఎన్ఆర్ఐ కాకుబల్ నాగేష్ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. 13మంది వైద్యులు, 25మంది సిబ్బందితో నిర్వహించనున్న ఈశిబిరంలో గుండె, ముక్కు, కంటి, ఎముకలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ, ఇతర పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్సలను చేస్తామని తెలిపారు. ఆదోని డివిజన్‌లోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అక్రమ రవాణా చేపడితే చర్యలు


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ పులిశేఖర్

**తుగ్గలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** ఎవరైనా వాహనాలో అక్రమ రవాణా చేపడితే చర్యలు తప్పవని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ అన్నారు. శుక్రవారం తుగ్గలిలో ఆయన వాహనాలను తనిఖీచేశారు. వాహనాల్లో అక్రమ మద్యం, నిషేధిత వస్తువులను రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదుచేస్తామని ఆయన హెచ్చరించారు. వాహనదారులు అన్నిరికార్డులను వాహనాల్లోనే ఉంచుకోవాలన్నారు. లైసెన్స్, బీమా కలిగిఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఈయన వెంట తుగ్గలి ఎస్ఐ క్రిష్ణమూర్తి, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

## సీఎంను విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదు


మాట్లాడుతున్న తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సురేంద్ర

**ఆలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** సీఎం చంద్రబాబును విమర్శించే స్థాయి ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షికి లేదని టీడీపీ తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సురేంద్ర నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీను విడతలవారీగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే అవగాహన లేక మీడియాలో ఉనికి కోసం జగన్ మెప్పు కోసం చంద్రబాబుపై విమర్శలు చేయడం తగదన్నారు. టీడీపీలోనే వాల్మీకులకు సముచిత స్థానం కలుగుతుందన్నారు. నాయకులు డా నెట్టప్ప, అంజి, చంద్ర, అరికెర మల్లేష్, నాగరాజు, వీరేశ్, కిష్టప్ప, శేకర్, మల్లికార్జున, లింగప్ప పాల్గొన్నారు.

## పేదల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం : బత్తిన

**తుగ్గలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** నిరుపేదల అభివృద్ధి కోసం కార్పొరేషన్ రుణాలు అందించి పేదలను ఆర్థికంగా ఎదిగేలా చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, టీడీపీ సీనియర్ నాయకులు సురేష్ చౌదరి, వెంకటస్వాములు అన్నారు. శుక్రవారం అమీనాబాదులో దాసరి మోహన్, పద్మావతి ఇంట్లో జరిగిన ఓకార్యక్రమంలో వారు విలేకరు లతో మాట్లాడారు. వైసీపీని రాష్ట్రంలో ప్రజలు నమ్మరని అన్నారు. టీడీపీ నాయకులు దాసరి గోవిందప్ప, హేమసుందర్, రామకృష్ణ, పంచాయతీ సలహాదారుడు మధుబాబు, వైస్ సర్పంచ్ రామచంద్ర, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్, తిరుమల తేజ పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చేందుకే నీటి తొట్లు

**తుగ్గలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** మూ గజీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్లు నిర్మిస్తున్నట్లు ఏపీవో హేమసుందర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చెన్నంపల్లి, జొన్నగిరి, ఎర్రగుడి గ్రామాల్లో ఉపాధి హామీ కింద నిర్మిస్తున్న నీటితొట్లను టీడీపీ నాయకుడు వెంకటస్వామి, సర్పంచ్ విజయలక్ష్మి, మధుబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ మండలంలో దాదాపు 29 నీటి తొట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. టీఏలు రామకృష్ణ, రాజశేఖర్, ఎఫ్ఏలు సతీష్‌కుమార్‌చౌదరి, అక్బర్‌బాషా, వెంకట్, గోవిందు తదితరులున్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

**మద్దికెర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** వాతావరణంలో మార్పులు అవుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హుశేన్ సాహేబ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని తెలిపారు. వర్షాలు వచ్చేటప్పుడు చెట్లు, టవర్, ఇళ్ల పైన ఉండకూడదన్నారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు.

## 21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

**పత్తికొండ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** ఈనెల 21న పత్తికొండ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విక్టర్ సామేల్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 21న సోమవారం ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు పాఠశాలలోనే 6వతరగతి ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడు చేసుకుని పరీక్షకు వచ్చేటప్పుడు రెండు పాస్‌ఫోటోలు తీసుకుని సకాలంలో పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

## 'అవినీతికి ఆస్కారం లేదు'

**ఆదోని టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):** బీజేపీలో అవినీతి చేయడానికి ఏమాత్రం ఆస్కారం ఉండదని ఆపార్టీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేష్‌నాయక్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండగిరి గ్రామ పంచాయతీకి చెందిన మాజీ స్కూల్ చైర్మన్ ఉలియప్ప ధనార్జన ఉద్దేశంతో ఇటీవలే బీజేపీలో చేరినట్లు తెలిపారు. అవినీతికి ఆస్కారం లేదని గ్రహించిన ఆయన పార్టీ నుంచి వైదొలిగి ఎమ్మెల్యే దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అవినీతి పరులు చేసే దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నాయకులు నాగేష్, జయలక్ష్మి, జీకే అంజనేయులు, కురువ ప్రదీప్ పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

**ఆలూరు/ పత్తికొండ, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి):** అగ్ని ప్రమాదాలపై ఫిల్లింగ్ సెంటర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆలూరు అగ్నిమాపక అధికారి ఖా ద్రి సూచించారు. శుక్రవా రం విరుపాక్షిరెడ్డి పెట్రో ల్‌బంక్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బందికి అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. లీడింగ్ ఫైర్‌మెన్‌లు కిరణ్, ఆనంద్, అహ్మద్, బాష, డ్రైవర్ వెంకటేష్ పాల్గొన్నారు. ముందస్తు జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాలను నివారించగలమని పత్తికొండ ఫైర్‌అధికారి దినకర్‌బాబు అన్నారు.పత్తికొండలోని పెట్రోల్‌బంకుల వద్ద అగ్నిప్రమాదాల నివారణ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

## మీటింగ్‌కట్ట నిర్మాణానికి భూమిపూజ

**పత్తికొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని తేరుబజార్‌లో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సొంతఖర్చులతో పునర్నించతలపెట్టిన మీటింగ్‌కట్ట నిర్మాణపనులు శుక్రవారం పూజలతో న్యాయవాది సురేష్ ప్రారంభించారు. చరిత్రకలిగిన మీటింగ్‌కట్ట శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికుల వినతిమేరకు ఎమ్మెల్యే సొంతనిధులతో పనులు చేపట్టారు. నాయకులు సింగం శ్రీనివాసులు, ఉచ్చీరప్ప, హరినాథ్‌గౌడ్, మీరాహుసేన్, స్థానికులు తుప్పద నాగన్న, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

# ఆ రుధిరం సర్వ పాప హరణం


ఆలూరులో సిలువ మోస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌సీఎం చర్చి సభ్యులు


ఆదోని ఎస్‌కేడీ కాలనీ చర్చిలో హాజరైన క్రైస్తవులు


పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


దేవనకొండ మండలం తెర్నెకల్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైసవులు

- భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- సిలువతో పురవీధుల గుండా ఊరేగింపు
- ఉపవాస దీక్షలున్న క్రైస్తవులు
- భక్తులకు అన్నదాన కార్యక్రమాలు


ఆదోని క్యాథలిక్ చర్చిలో సిలువ యాత్రకు హాజరైన భక్తులు


ఆదోని విక్టోరియా పేట చర్చిలో సందేశాన్ని చెబుతున్న పాస్టర్ విలియం సుజిత్


ఆదోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

**ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** ఏసు క్రీస్తు సిలువలో చిందించిన రక్తం (రుధిరం) ద్వారా సర్వలోక మానవాళి పాపాన్ని హరించిందని ఎస్‌కేడీ కాలనీ సీఎస్ఐ హోలీ ట్రినిటీ పాస్టర్ రెవరెండ్ భరత్ హెరాల్డ్ అన్నారు. శుక్ర వారం ఆదోని పట్టణంలో పలు క్రైస్తవ సంఘాలలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విక్టోరియా పేట సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ సుజిత్ విలియమ్స్ ఆధ్వర్యంలో ఎస్‌కేడీ కాల నీలోని హోలీ ట్రినిటీ చర్చ్ పాస్టర్ రెవరెండ్ భరత్ హెరాల్డ్ ఆధ్వర్యంలో, మహిమా ప్రార్థన మం దిరంలో పాస్టర్ ప్రకాష్ బేరియా చర్చి, హోసన్న మందిరం, మండగిరి క్యాథలిక్ బాలయేసు మందిరంలో కోలా విజయ రాజు ఆధ్వర్యంలో పలు క్రైస్తవ సంఘాలలో శుభ శుక్రవారం ప్రార్థనలకు భారీగా తరలి వచ్చారు. ఏసు క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానించుకున్నారు. పాప విమోచకుడు పావన మూర్తి అయినా ఏసు క్రీస్తు మరణంతో లోకానికి కొత్త రక్షణ లభించిందని దైవ సేవకులు ప్రసంగిం చారు. ఆయన రుధిరం పాపహరణం. అందుకే ఏసుక్రీస్తు జీవితాన్ని, సిలువ త్యాగాన్ని స్మరిస్తూ గుడ్ ఫ్రైడేను జరు పుకుంటున్నామని తెలిపారు. మండగిరి క్యాథలిక్ బాలయేసు మందిరం, సాంబగల్లు గ్రామ ఆర్‌సీఎం చర్చిలో సిలువ యా త్ర చేపట్టారు. క్రైస్తవులు సిలువను మోసి ప్రార్థనలు చేపట్టారు. విక్టోరియా పేట సీఎస్ఐ చర్చి పెద్దలు సునీల్ రాజ్‌కుమార్, శ్రీకాంత్, హోలీ ట్రినిటీ చర్చి సంఘం కార్యదర్శి మేష డేవిడ్, ట్రజరర్ ఎస్టీ విల్సన్ పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

**మద్దికెర/ తుగ్గలి/ వెల్దుర్తి/ ఆలూరు/ దేవనకొండ/ పత్తికొండ:** క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మద్దికెరలోని మెయిన్ బజారులోని క్యాథ్రిక్ చర్చి నుంచి క్రైస్తవులు యేసుప్రభు సిలువను పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. చిన్నారులు సైతం యేసుప్రభు అలం కరణలో నడిచారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉపవాసాలు ఉన్న క్రైస్తవులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు శాంసన్, భైరెడ్డి రవి, భైరెడ్డి ఆనందు, రాజు, తదితరులు ఉన్నారు. తుగ్గలి మండలంలోని అన్నిగ్రామాల్లో క్రైస్తవులు ఉపవాసాలు ఉండి చర్చీలకు వెళ్లి యేసుక్రీస్తును ధ్యానిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ పెద్దలు, పాస్టర్లు గుడ్ ఫ్రైడే విశిష్టను వివరించారు. దేవనకొండ మండలంలో తెర్నేకల్, పొట్లపాడు, నేలతలమరి, కోటకొండ, దేవనకొండ గ్రామాల్లో, వెల్దుర్తి మండలంలోని అన్ని చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలూరు మండలంలోని మొలగవల్లి కొట్టాల, ఆలూరు సీఎస్ఐ, హోసన్నా చర్చిలలో క్రీస్తు సిలువ సందేశాన్ని పాస్టరులు వివరించారు. ఆర్‌సీఎం చర్చి పాదర్ జ్ఞాన ప్రకాష్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు తపస్సు మాల ధరించి సిలువ మోస్తూ ప్రదర్శన నిర్వహించారు. పత్తికొండలోని సిఎస్ఐ, అపోస్థులల చర్చిలతోపాటు పలుచర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, ఏసు సిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించారు. రేపు పత్తికొండలో రన్‌ఫర్ జీసస్ పేరిట 2కే రన్ ఉంటుందని చర్చిల నిర్వాహకులు తెలిపారు.

## వైభవంగా సుంకలాపరమేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే విరుపాక్షి

**ఆలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని కమ్మరచేడులో వెలసిన సుంకలాపరమేశ్వరిదేవి విగ్రహ, నాగ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సుంకలా పరమేశ్వరి దేవాలయంలో కుక్కి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పండితులు రామకృష్ణ భట్ ఆదోని విష్ణువర్ధన్ శర్మ, బళ్లారి సుర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రాణ ప్రతిష్ఠ, గోసమేత జ్వాలా వర్మన హోమలు పూర్ణహుతి, మహ కుంభాబిషేకం, మహా మంగళ హారతిని ఘనంగా చేపట్టారు. ఈ సం దర్భంగా ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఆలూరు ఎమ్మె ల్యే విరుపాక్షి, ఎంఎస్‌సీ డాక్టర్ మధుసూదన్ ప్రత్యేక పూజలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ పెద్దలు మల్లికార్జున రెడ్డి, పలాద్ రెడ్డి, వీరసేన రెడ్డి, సర్పంచు సుమతి రెడ్డి, అనిల్ రెడ్డి, టీడీపీ రైతు కమిటీ తాలూకా అధ్యక్షులు కురవ దేవేంద్రప్ప, శ్రీధర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మద్దిలేటి, మహీధర్ రెడ్డి రంగప్ప, రామప్ప, రాజకుమార్, వెంకప్ప, బసవరాజు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం రిలే దీక్ష

**ఆదోని టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** ప్రజలు ఎదుర్కొంటున్న స మస్యల పరిష్కారంకోసం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, అగ్రికల్చ రల్ మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ దీక్ష చేపట్టారు. శుక్ర వారం ప్రధానకూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఒక్కరోజు రిలే నిరాహారదీక్షను చేపట్టి ఆయన మాట్లాడారు. పట్టణాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాడని ఓట్లేసి గెలిపించిన ఎమ్మెల్యే పార్థసారథి ఎలాంటి అభివృద్ధి పనులకు నిధులు తీసుకొని రాకపోవడం విచారకరమన్నారు. సీపీఐ, సీపీఎం, వైసీపీ మహిళా విభాగం నాయకులు, వీరశైవ సంఘం, కన్నడ సంఘం సభ్యులు, విద్యార్థి సంఘాలు, కౌన్సిలరులు, మైనారిటీ పోరాట పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్, ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అసోసి యేషన్ కన్వీనర్ ఆదినారాయణ, కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీనూర్ అహమ్మద్ దీక్షకు సంఘీభావం తెలిపారు.

### వైద్య శిబిరానికి స్పందన

**ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** ఆదోని డివిజన్ జం గమ అర్చక సమైక్య అల్కూరు మఠం సిద్దయ్య స్వామి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా శుక్రవారం మల్లికార్జున విద్యాలయ ఆవరణలో ఏర్పా టుచేసిన ఉచిత వైద్యశిబిరానికి భారీస్పందన లభించింది. పట్టణంతో పా టు డివిజన్‌లోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు. కిమ్స్ ఆసుపత్రి (కర్నూల్)కు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వ హించి రోగులకు ఆరోగ్య సలహాలను అందించారు. అల్కూరు మ ఠం విజయకుమార్ మహర్షి మాట్లాడుతూ, దూరప్రాంతాల నుంచి వైద్యపరీక్షల నిమిత్తం వచ్చిన గ్రామీణ ప్రాంతాల ప్రజల కు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు.

## కన్నుల పండువగా గూలిబసవేశ్వరస్వామి రథోత్సవం


గూలిబసవేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

**ఆదోని, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని చాగి గ్రామంలో వెలసిన గూలి బసవేశ్వరే స్వామి రథోత్సవం కన్నుల పండుగ జరిగింది. స్వామివారికి మొక్కులు తీర్చుకునేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఆకుపూజ, కుంకుమార్చన, జలాభిషేకం వంటి పూజలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం 6:30గంటలకు రథోత్సవం గ్రామవీధుల గుండా సాగింది. రథం ముందు నందికోల సేవ, ప్రత్యేకపూజలు చేశారు. సర్పంచ్ రాజారెడ్డి, అయ్యప్ప రెడ్డి, రామన్నగౌడ్, మహాదేశ్వప్ప, చెన్నబసయ్యస్వామి పాల్గొన్నారు.

### ఘనంగా భంభంస్వామి ఉరుసు

**పత్తికొండ, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) :** స్థానిక ఊరికొండపై వెలసిన భంభంస్వామి దర్గా ఉరుసు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు దర్గాను సందర్శించి స్వామికి చక్కెర చదివింపులు జరిపారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా వైకుంఠం శివప్రసాద్ జన్మదిన వేడుకలు


ఆలూరులో వైకుంఠం శివప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు


వైకుంఠం శివప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాచర్ల టీడీపీ నాయకులు

**ఆలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఆలూరులో ఘనంగా నిర్వహించారు. ఆరు మండలాల నుంచి టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటామని వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం జ్యోతి అన్నారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కుదువ జయరాం, మాజీ ఎంపీపీ బిల్లేకల్ వెంకటేష్, టీడీపీ నాయకులు రామచంద్ర నాయుడు, దేవనకొండ, చిప్పగిరి, మండల కన్వీనర్లు శేషగిరి, విష్ణు, శ్రీనివాసులు, కృష్ణ యాదవ్, జీవన్‌కుమార్, శీనప్ప, మల్లికార్జున, నర్సిరెడ్డి, వీరేష్, రెహమాన్, విశ్వతేజ, రాజశేఖర్, రాఘవేంద్ర, శ్రీనివాసులు, రామాంజినేయులు, తిమ్మప్ప, వెంకటేష్, సురేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

**జన్మదిన వేడుకలకు తరలి వెళ్లిన ..**

**చిప్పగిరి:** ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వైకుంఠం శివప్రసాద్ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఆయన జన్మదిన వేడుకలకు సందర్భంగా చిప్పగిరి నంచర్ల తదితర గ్రామాల నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు వెళ్లి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రవి తేజ, తిమ్మప్ప, అఖిల్, కుమార్, ఉసిరి రామాంజి, ఉసిరి సురేష్, వెంకటేష్ కొండ రామాంజినేయులు పాల్గొన్నారు.

## మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు

**వెల్దుర్తి, ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి):** చెర్లకొత్తురు గ్రామ సమీపంలో విట్టలరాయి మొరుసు కట్టచెరువులో అక్రమ మట్టి తవ్వకాలను శుక్రవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టారు. గమనించిన గ్రామస్థులు మట్టి తవ్వకాలను అడ్డుకొని వాహనాలను నిలిపివేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని తవ్వకాలు చేపట్టిన జేసీబీ, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే చెరువు మట్టిని అక్రమంగా తరలించడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

## పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు

**మద్దికెర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల పెంపకానికి ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఉపాధి ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకునే రైతులు ఉపాధి జాబ్‌కార్డులు కలిగి ఉండాలన్నారు. చిన్న, సన్నకారు రైతులుగా తహసీల్దార్ గుర్తించాలన్నారు. ఐదెకరాల కంటే తక్కువగా భూమి కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల రైతులు వ్యవసాయ భూమి, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, రేషన్, ఆధార్, కరెంటు బిల్లుల జిరాక్స్‌లు, భూమి పరీక్షల కార్డు దరఖాస్తుతో పాటు జతచేయాలన్నారు.

## టీడీపీతోనే దళితుల అభివృద్ధి

**మద్దికెర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** దళితుల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పారా రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు ఎం. అగ్రహారం ఆనంద్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు.

### ఎస్సీ వర్గీకరణపై ..

**ఆదోని అగ్రికల్చర్:** ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై ఎంఆర్‌సీఎస్, ఎంఈఎఫ్ఎస్ఎఫ్ కార్యకర్తలు శుక్రవారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. మునిసిపల్ మైదానం నుంచి ర్యాలీగా వెళ్లి భీమాస్ కూడలిలో ఎంఆర్‌సీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకంచేసి స్వీట్లు పంచారు.

**ఆస్పరి:** ఆస్పరిలో ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నా యకులు ప్రధానిమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తంచేశారు.

## పిడుగు పడి ఎద్దు మృతి

**ఆస్పరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) :** మండల కేంద్రం శుక్రవారం పిడుగు పడి మహబూబ్‌భాషకు సంబంధించిన ఎద్దు మృతి చెందింది. పిడుగు శబ్దానికి వామిదొడ్డిలో కట్టేసిన రెండు ఎద్దులు అపస్మారక స్థితిలోకి వెళ్లాయి. ఒక ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు సుమారు రూ.75,000 వరకు విలువ చేస్తుందని రైతు తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభం

**ఆస్పరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక బస్టాండ్ సమీపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. ఆదోని, ఆస్పరి ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రహల్లాద శెట్టి, చంద్రశేఖర్ చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సురేష్‌కుమార్, పవన్‌కుమార్, ఆనంద్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు వేతనాలు పెంచాలి

**ఆలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** మేజర్ గ్రామ పంచాయతీలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మి కులు, సిబ్బందికి వేతనాలు పెంపుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు నారాయణస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 20నుంచి 30ఏళ్లుగా పా రిశుధ్య కార్మికులు పనిచేస్తున్న వేతనం పెరగడం లేదన్నారు.

## దేవాలయాభివృద్ధికి విరాళం

**ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) :** పూరాతన కోట చంద్రమౌళీశ్వర దేవాలయ అభివృద్ధికి శుక్రవారం ఆదోనికి చెందిన రైల్వే ఈరన్న తనవంతుగా రూ.2లక్షలు విరాళం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ రవి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు హనుమంతు, మహేష్, గోవిందు, వెంకటేష్ వున్నారు.

# ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

## 22వ తేదీ వరకు వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 22వ తేదీ వరకు మోస్తారు వర్షాలు కురుస్తాయని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దాదాపు 10మి.మీ వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. 62నుంచి 87కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయన్నారు. వర్షాపాతాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో తెలుసుకోవచ్చని తెలిపారు.

## లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టులను ఎన్డీయే కూటమి ప్రభుత్వం భర్తీ చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయకుండా ఐదేళ్లు కాలయాపన చేసిందన్నారు. యూనివర్సిటీలు, కేజీబీవీ, పాఠశాలలు, కళాశాలల్లో లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వారంలో ఒకరోజు లైబ్రేరి డేను నిర్వహిస్తున్నా లైబ్రేరియన్ పోస్టులను మాత్రం ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. స్థానికంగా పనిచేస్తున్న వారినే ఇన్‌చార్జిలుగా నియమిస్తూ కాలం వెళ్లదీయడం సరికాదన్నారు. ఎంతో మంది లైబ్రేరియన్ కోర్సులు పూర్తిచేసి ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

## భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

● నలుగురికి రిమాండ్



స్వాధీనం చేసుకున్న మద్యం, వాహనంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, సిబ్బంది

కోసిగి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మాలపల్లి నుంచి కంబాలదిన్నె రోడ్డులో మారెమ్మ గుడి వెనుకాల కారులో అక్రమంగా 40 బాక్సుల కర్ణాటక మద్యం తరలిస్తున్నారని శుక్రవారం పక్కా సమాచారం అందింది. దీంతో సీఐ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులుచేసి 3,840 డీలక్స్ విస్కీ 40 బాక్సులు ఇన్నోవా కారును పట్టుకున్నట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. అక్రమ మద్యం పట్టుకున్న విలువ రూ.3,53,600 ఉండొచ్చని ఆయన తెలిపారు. పట్టుబడిన నిందితుల్లో మంత్రాలయం మండలం రచ్చుమర్రికి చెందిన గుడుగుడు గోవింద, పోలివీరేష్, మజ్జిగ బొజ్జప్ప, పెద్దకడుబూరు మండలం కబందహాల్ గ్రామానికి చెందిన బోయ బాలును అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన ఆదోని శివశంకర్, పెద్దకడుబూరు మండలం కంబాలదిన్నె గ్రామానికి చెందిన బోయ హుశేనీ పరారీలో ఉన్నారని ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కేఆర్ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది కిషోర్, మునిరంగడు, భరత్, రవికుమార్, మధు, లాలు, కుమారస్వామిరెడ్డి తదితరులున్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ



మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్

కౌతాళం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం మండలంలోని ముస్లింలు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ, రాస్తారోకో చేపట్టారు. ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లువల్ల దేశంలో సమగ్ర ఐక్యతకు భంగం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. వక్ఫ్ బోర్డు కమిటీల్లో ముస్లిమేతరులను నియమించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అంతకుముందు సీపీఎం, సీపీఐ, దళిత సంఘాలతో కలిసి ర్యాలీ చేపట్టి అంబేడ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో కౌతాళం సర్పంచ్ పాల్‌దినకరన్, సీపీఎం నాయకులు మల్లయ్య, ఈరన్న, సీపీఐ నాయకుడు ఈరన్న ఎమ్మార్పీఎస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు అవాజ్ కమిటీ నాయకులు, ఖాదర్ లింగ స్వామి దర్గా ధర్మకర్త పెద్ద మున్నాపాష పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పెద్దకడుబూరు, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జయరాముడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ రుణాలను అందజేయనుందన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

## ఆటో బోల్తా : ఇద్దరికి తీవ్రగాయాలు

మంత్రాలయం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లిలో మంత్రాలయానికి చెందిన ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. మాధవరం నుంచి మంత్రాలయం వస్తున్న ఆటో చెట్నహళ్లి గ్రామానికి చెందిన ఆనందు ఆటో ఎక్కి వస్తుండగా.. సీఎస్ఐ చర్చి సమీపంలో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్‌కు, ప్రయాణికుడు ఆనంద్‌కు కాళ్లు విరిగాయి. ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని మంత్రాలయం పోలీసులు తెలిపారు.

## తాగునీటి కొళాయి వద్ద ఇరువర్గాల ఘర్షణ

మంత్రాలయం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామంలో తాగునీటి కొళాయి వద్ద తాగునీరు పట్టుకునే విషయంలో ఘర్షణ చోటు చేసుకున్నది. దీంతో కురువ సరస్వతి అనే మహిళను అసభ్య పదజాలంతో మాట్లాడి దాడి చేయడంతో ముఖానికి గాయాలైనట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. కురువ సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కురువ రోగన్న, కురువ నరసన్న, భీమన్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో వర్గానికి చెందిన కురువ రోగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కురువ వీరేష్, కురువ నాగప్ప, నాగేష్‌లపై కేసు నమోదైనట్లు తెలిపారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దూషించుకుంటూ దాడులు చేసుకోవడంతో గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. శుక్రవారం చైత్రమాసం పంచమిని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి మహా మంగళహారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

# ‘పీఎంశ్రీ’ పనులు నాసిరకం

● ప్రారంభానికి ముందే పగుళ్లు, చీలికలు
● రూ.ఐదు లక్షలు మట్టిపాలు
● నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు



మోడల్ స్కూల్ వద్ద కబడ్డీ కోర్టు నిర్మిస్తున్న దృశ్యం



ప్రారంభానికి ముందే పగుళ్లు వచ్చిన కబడ్డీ కోర్టు గోడ



నిర్మిస్తున్న కిచెన్ గార్డెన్

మంత్రాలయం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో పీఎంశ్రీ (స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) కింద మంజూరైన రూ.5లక్షలతో క్రీడలను ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టారు. ఆ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లేకపోవడంతో నిధులు మట్టిపాలయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడలను అభివృద్ధి చేసేందుకు, క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఏపీ మోడల్ స్కూల్ అభివృద్ధికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇందులో కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్, వాలీబాల్, కిచెన్‌గార్డెన్, ఫెన్సింగ్ పనులు చేపట్టారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వెంకటేశ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రిన్సిపాల్ పనులను దగ్గరుండి పర్యవేక్షించాలి. వీటిని సర్వశిక్ష అభియాన్ సైట్ ఇంజనీర్ రంగరాజు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉండగా అవేమీ పట్టించుకోవడం లేదు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్, సైట్ ఇంజనీర్, విద్యాకమిటీ చైర్మన్ వెంకటేశ్ ఎవరికి వారే కాంట్రాక్టు ఇచ్చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టరు ఎర్రమట్టి తోలి, ఎర్రమట్టి చుట్టూ బ్రిక్స్‌తో గోడ కట్టాడు. గోడ కట్టి నెల రోజులు కాకముందే పగుళ్లు వచ్చాయి. ఖోఖో కోర్టు కూడా అదే పరిస్థితిలో నెలకొంది. కిచెన్‌గార్డెన్‌లో కూరగాయల మొక్కలు పెంచి అక్కడ పండించిన కూరగాయలతో విద్యార్థులకు వంటలో ఉపయోగించుకునేవిధంగా ఏర్పాట్లు చేశారు. దీనిని సైతం నాసిరకంపైపులు పగిలిపోయిన బ్రిక్స్, గోడ నిర్మించి, ఇనుప కడ్డీలతో ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. ఈనెల 23న విద్యార్థులకు వేసవి సెలవులు ఉండటంతో ప్రారంభానికి ముందే గోడలు పగుళ్లు రావడం, వర్షం వస్తే నీరు నిల్వ ఉండి ఎర్రమట్టి కొట్టుకుపోయే ప్రమాదముంది. పాఠశాల తెరిచేలోగా రూ. ఐదు లక్షలతో నిర్మించిన పనులు మట్టిపాలయ్యే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. నాసిరకం బ్రిక్స్, వాగుల్లో దొరికే ఇసుక తక్కువ మోతాదులో సిమెంటు ఉపయోగించడం వల్లే ఈ పగుళ్లు వచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. నాణ్యతను పట్టించుకోవాల్సిన సైట్ ఇంజనీర్, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా ఉండటంతోనే సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టమొచ్చినట్లు పనుల చేపట్టినట్లు తెలుస్తోంది. సంబంధిత ఉన్నతాధికారులు నాణ్యతను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### నాసిరకంగా నిర్మిస్తే చర్యలు

రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో క్రీడలను ప్రోత్సహించేందుకు చేపట్టిన పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటాం. విద్యాకమిటీ చైర్మన్, సంబంధిత మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలోనే పనులు కొనసాగుతున్నాయి. ప్రతి రోజు పరిశీలించి నాణ్యత ప్రమానాలు చూసుకోవాల్సిన బాధ్యత వారిదే. నాణ్యతను పాటించకపోతే బిల్లు మంజూరులో కోత విధిస్తాం.

- బి.రంగరాజు, సైట్ ఇంజనీర్, ఎస్ఎస్ఏ, మంత్రాలయం

### నాణ్యతను పరిశీలించాల్సింది సైట్ ఇంజనీరే

పీఎంశ్రీ కింద మంజూరైన ఆట మైదానం నాణ్యత ప్రమాణాలు చూడాల్సిన బాధ్యత ఎస్ఎస్ఏ సైట్ ఇంజనీర్‌పైనే ఉంటుంది. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. కూలీలతో పనులు చేయిస్తున్నారు. చేసినపనులకు పాఠశాల విద్యాకమిటీ బిల్లులు చెల్లిస్తుంది. నాణ్యతగా పనులు చేపట్టేందుకు తమ వంతు కృషి చేస్తున్నాం. ప్రహరీ నిర్మాణం అసంపూర్తిగా ఉన్నది.

●ప్రసాద్, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్ రచ్చుమర్రి

## వర్గీకరణ ఆమోదంపై హర్షం



సోమప్ప సర్కిల్‌లో డప్పులు వాయిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంత్రాలయం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్ల పోరాటాల ఫలితంగా టీడీపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలపడం హర్షనీయమని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వి.తిమ్మాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంతో మంది పోరాటాలు చేసి అమరవీరుల త్యాగాల ప్రతిఫలానికి నిదర్శనంగా ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. వచ్చే కులగణాంకాల లెక్కల ప్రకారం మాదిగలకు సరైన పర్సంటేజీ రిజర్వేషన్ ఇచ్చి దళిత గిరిజనులకు ప్రైవేటు రంగాల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఇందుకోసం పోరాటాలు, ఉద్యమాలు చేస్తుందని తెలిపారు.

### ఎస్సీ వర్గీకరణ అమలు ఘనత సీఎందే

ఎమ్మిగనూరు టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు ఘనత సీఎం చంద్రబాబుదేనని టీడీపీ నాయకులు కదిరికోట అదెన్న అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణపై వైఎస్ఆర్ సీపీ గోడ మీద పిల్లిలా వ్యవహరించిందన్నారు. దళితుల సంక్షేమాన్ని వైసీపీ గాలికి వదిలేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వర్గీకరణ అమలు చేయడం సంతోషమన్నారు.

● ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్య,వైద్య,ఉద్యోగ నియమాకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను గవర్నర్ అమోదం తెలపడంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్రకార్యదర్శి ఆనంద్ చైతన్య మాదిగ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముప్పైఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితం నేడు ఎస్సీ వర్గీకరణ అన్నారు. టీడీపీ ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## అకాల వర్షం.. అపార నష్టం



అకాల వర్షానికి నేల కొరిగిన వరి పంట

కౌతాళం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళిగనూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వరి రైతులకు అపార నష్టం కలిగింది. సాయంత్రం ఉన్నట్టుండి ఈదురు గాలులతో కూడిన వర్షానికి చేతికి వచ్చిన వరి పంట నేలపాలైంది. ఇప్పటికే కోసిన వరి పంటను కల్లాలలో ఆరబెట్టగా ఒక్క సారిగి వర్షం రావడంతో వరిపంటలో నీళ్లు చేరి ధాన్యం తడిసి ముద్దాయినది. దీంతో రైతన్నలకు అపార నష్టం కలిగించింది. ప్రభుత్వం రైతులకు జరిగిన నష్టానికి పరిహారం అందించాలని మేళిగనూరు గ్రామ రైతులు కోరుతున్నారు.

### జీవాల మూగ రోదన



మండుటెండలో తాగునీటి కోసం మూగజీవాల అవస్థలు

గోనెగండ్ల, ఏప్రిల్ 18(ఆంధ్ర జ్యోతి): ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. పంట పొలాల్లోని బావులు, బోర్ల దగ్గర నీరు లేకపోవడంతో మూగజీవాలకు తాగు నీటి సమస్య తీవ్రమైంది. పొలాల దగ్గర నీరు లేదు. దీంతో మూగజీవాల రోదన అరణ్యరోదనగానే మిగిలిపోతుంది. మండలంలోని పలు గ్రామాల్లో మేకలు, గొర్రెలు, పొట్టేళ్ల పంట పొలాల్లో తాగు నీరు లేక తీవ్రఇబ్బందులు పడుతున్నాయి. మేతకు వెళ్లిన మూగజీవాలు నీరు లేక మండుటెండల్లో తల్లడిల్లినట్టు కాపరులు తెలుపుతున్నారు. తాగునీరు అందక రెండు జీవాలు మరణించినట్లు కాపరులు తెలిపారు. పొలాల్లో పక్షులు సైతం నీరులేక మృతి చెందుతున్నాయి.

## మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు



శ్రీమఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

మంత్రాలయం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడి గా మారింది. శుక్రవారం సెలవు దినం కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

● రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం చైత్ర మాస పంచమి శుభదినం సందర్భంగా మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహా మంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

### మఠానికి రూ. లక్ష విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన గురాజు అనేభక్తుడు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. శుక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి జ్ఞాపికను ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అనంతపురాణిక్, గిరిధర్, శ్రీపాధాచార్, జేపీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ నాటకాన్ని జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సమాజమే తనకుటుంబంగా భావించిన మేరునగధీరుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నాటకాన్ని జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం శుక్రవారం కోరారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ జయంతి మాసోత్సవాలను పురస్కరించుకొని కర్నూలు జిల్లాలో అంబేడ్కర్ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22న మంత్రాలయం మండలం మాధవరం, 23న ఎమ్మిగనూరు పట్టణంలో, 24 ఎమ్మిగనూరు మండలం ఏనుగబాలలో, 25 కర్నూలు మండలం ఉల్చాలలో, 26న కర్నూలులో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ నాటకాన్ని కుటుంబసమేతంగా వీక్షించేందుకు తరలిరావాలని కోరారు.

## దళితుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ నాయకుకులు

ఎమ్మిగనూరు,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దళితుల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి రుజువు చేశారని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, సుందరరాజు, దావీదు, కటారి రాజేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ ఉపవర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గతంలోనే ఎస్సీ వర్గీకరణను నాలుగేళ్లు అమలు చేసింది సీఎం చంద్రబాబేనన్నారు. ఇప్పుడు కూడా సీఎం చంద్రబాబు హయాంలోనే ఎస్సీ వర్గీకరణ అమలుకు క్యాబినెట్ ఆమోదరం తెలిపి అమలు చేయటం అదృష్టమన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు అంబేడ్కర్, శాలేం, అనిల్ కుమార్, రాజు, మని, ప్రకాష్, గుడికల్ దేవదాసు, జక్కిరయ్య, పౌలయ్య, బనవాసి అబ్రహం పాల్గొన్నారు.

## అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంక్ దగ్గర అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మిగనూరు అగ్నిమాపక కేంద్రం అధికారి రామాంజనేయులు సూచించారు. అగ్నిప్రమాదాల వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంక్ దగ్గర మాక్ డ్రిల్ నిర్వహించారు. గ్యాస్, ఆయిల్, ఎలక్ట్రికల్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటాయన్నారు. ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వమానవాళి కోసం రక్తం చిందించిన ఏసుక్రీస్తు

● భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే
● చర్చిల్లో ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలపై ధ్యానం



ఎమ్మిగనూరులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కోసిగిలో సిలువ మోస్తున్న పాస్టర్ జాకోబు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సర్వమానవాళి కోసం సిలువపై ఏసుక్రీస్తు రక్తం చిందించి బలియాగం అయ్యారని ఎంబీ యోరుషలేం చర్చి పాస్టర్ రెవరెండ్ జయన్న అన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని ఎంబీ యోరుషలేం చర్చితో పాటు పట్టణంలోని ఆయా ప్రాంతాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేకప్రార్థనలు చేశారు. అలాగే ఉపవాసదీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంబీ చర్చిలో సిలువలో ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలను భక్తులు ధ్యానించారు. గాయకులు దేవపుత్ర, దేవరాజు ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమాల్లో సంఘ పెద్దలు భాస్కర్ బాబు, తిమ్మరాజు, రాజశేఖర్, నరసింహులు, దేవరాజు, బాలయ్య, శాంతిరాజు, జయపాల్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

మంత్రాలయం : నియోజకవర్గ కేంద్రం మంత్రాలయం, మాధవరం, చెట్నహళ్లి, రచ్చుమర్రి, మాలపల్లి, కల్లుదేవకుంట, సూగూరు, వగరూరు, రాంపురం, తుంగభద్ర గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం సీఎస్ఐ డివిజనల్ చైర్మన్ రెవ. హెచ్.వేదనాయకం, మాధవరం పాస్టర్ రెవ.జాన్‌వెస్లీ, ఎస్‌డీ రాజన్న, ఏసయ్య, రెవ. పాస్టర్ సేతు ఆధ్వర్యంలో యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానించారు. లోక రక్షకుడైన యేసుక్రీస్తు సిలువలో కార్చిన రక్తం వల్లే పాపక్షమాపణ కలుగుతుందన్నారు. చనిపోయి సమాధి చేయబడి మూడో రోజు తిరిగి లేచిన వ్యక్తి ప్రపంచంలో యేసుక్రీస్తు ఒక్కడేనని తెలిపారు. ఉపవాసం ఉన్న క్రైస్తవులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో సంఘ నిర్వాహకులు భూపతి, తిమ్మోతి, పాల్‌రాజు, వినోద్ కుమార్, మేకల తిమ్మోతి, యోబు, దేవదాసు, ప్రభుదాసు, కుమార్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గోనెగండ్ల, హెచ్ కైరవాడి, గాజులదిన్నె, కులుమాల, వేముగోడు, పుట్టపాశం, గంజహళ్లి, అగ్రహరం, బైలుప్పల, అలువాల, చిన్నమరివీడు, పెద్దమరివీడు, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, తిప్పనూరు, ఎర్రబాడు, పిల్లిగుండ్ల, నెరుడుప్పల గ్రామాలోని చర్చిల్లో పాస్టర్లు యేసు సిలువ కార్యాన్ని వివరించారు. ప్రంపంచ శాంతి కోసం దైవదూత ఏసుక్రీస్తు తన రక్తాన్ని చిందించాడన్నారు. కార్యక్రమంలో మహిళలు, యువకులు, పిల్లలు పాల్గొన్నారు.

కోసిగి: కోసిగితో పాటు అన్ని గ్రామాల్లో క్రైస్తవులు ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు. సిలువలో పలికిన ఏడు మాటలను పాస్టర్ జాకోబు వివరించారు. సిలువ యాత్ర బెళగల్ నుంచి కోసిగి రంగప్పగట్టు వరకు సాగిందన్నారు. రంగప్పగట్టులో క్రైస్తవసంఘాల పెద్దలు పాస్టర్ రాజారత్నం, సురేష్, దేవపుత్ర, శ్రీను, ప్రేమ్‌కుమార్, చిదానంద, సుమిత్ర, రాజేష్, శాంతమూర్తి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ఉపవాసదీక్షలతో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.